ఓఆర్ఎస్‌తో వేసవి సమస్యలకు చెక్

- వేసవిలో ఉష్ణాన్ని తగ్గించే ద్రావణం
- మోతాదుకు మించి తాగితే అనర్థం

పాలకొల్లు సెంట్రల్: మే నెల రాకుండానే ఎండలు మండిపోతున్నాయి. ఉదయం ఎనిమిది గంటల నుంచి భానుడు భగభగలాడుతూ జనాలను చమటలు పట్టిస్తున్నాడు. మధ్యాహ్నం అయ్యేసరికి ఉష్ణోగ్రతలు తీవ్రరూపం దాల్చేస్తున్నాయి. దాంతో రోజురోజుకూ ఉక్కబోత పెరిగిపోతుంది. ఇటీవల వాతావరణం మార్పుతో ఏమైనా వర్షాలు పడతాయోమో? అని ప్రజలు ఆశించారు. కానీ వర్షా ప్రభావం కనిపించినా ఉదయం, సాయంత్రం సమయంలో చల్లని గాలులు వీచాయే తప్ప వర్షం మాత్రం ఎక్కడా కురవలేదు. ఒకవేళ వర్షం కురిసినా ఆ క్షణం మాత్రమే చల్లగా ఉండేది తప్ప మరుసటిరోజు నుండి ఉష్ణోగ్రతలు మరింత ఉధృతమయ్యేవని అనుకుంటున్నారు.

అధిక ఉష్ణోగ్రతలతో ఇబ్బంది

పొట్టకూటి తప్పనిసరి పరిస్థితుల్లో కొంత మంది కార్మికులు ఎండలోనే శ్రమిస్తూ ఉంటారు. ఎండల్లో పని చేసే వారి శరీరంలో నీటి శాతం క్రమేపీ క్షీణించి వ్యాధి నిరోధక శక్తిని కోల్పోతారని వైద్యులు చెబుతున్నారు. ఫలితంగా వడదెబ్బతో పాటు అనేక అనారోగ్యాలకు గురికావాల్సి ఉంటుంది. అలాంటి ప్రమాద సమయంలో ఎటువంటి అనారోగ్యానికి గురి కాకుండా ఉండేందుకు ఓఆర్ఎస్ (ఓరల్ రీహైడ్రేషన్ సాల్ట్స్) ద్రావణం ఉపకరిస్తుందని వైద్యాధికారులు చెబుతున్నారు. ఇప్పటికే ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో ఓఆర్ఎస్ ద్రావణం తాగడం వల్ల కలిగే ప్రయోజనాలను క్షేత్ర స్థాయిలో ఇంటింటికి వెళ్లి వివరిస్తున్నారు. పలు కూడళ్లలో సమావేశాలు నిర్వహిస్తున్నారు. నియోజకవర్గంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, హెల్త్ క్లీనిక్‌లు, సిహెచ్‌సిలలో ఓఆర్ఎస్ ద్రావణాన్ని, జింక్ మాత్రలను అందుబాటులో ఉంచారు.


గ్రామాల్లో ప్రజలకు ఓఆర్ఎస్ ద్రావణ ప్యాకెట్లు అందిస్తున్న వైద్య సిబ్బంది

ఓఆర్ఎస్ ద్రావణం తాగడం వల్ల ఉపయోగాలు

వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా శరీరం నిర్దిష్టమైన ఉష్ణోగ్రత ఉండే విధంగా చర్యలు తీసుకోవాలి. మెదడులో హైపో తలామస్ అనే భాగం శరీరంలోని వేడిని క్రమబద్ధీకరిస్తుంది. తగిన నీటిని తాగకపోయినా లేదా ఎండలో ఎక్కువగా తిరిగినా హైపో తలామస్‌పై తీవ్ర ప్రభావం చూపుతుంది. దాని ఫలితంగా అధిక ఉష్ణోగ్రతలకు లోనై క్రమబద్ధీకరించే స్థితిని కోల్పోతుంది. ఆ పరిస్థితుల్లో తల తిరగడం, నీరసం, తలనొప్పి, జ్వరం, చీకటి కమ్మినట్టు అనిపిస్తూ ఉంటుంది. అలాగే వికారంగా వాంతులు అయ్యే లక్షణాలు కనిపిస్తాయి. ఆ లక్షణాలు ఉన్న వ్యక్తి వడదెబ్బకు గురైనట్లు నిర్ధారణ చేసుకోవాలి. ఈ సమయలో ఓఆర్ఎస్ ద్రావణాన్ని తాగితే చక్కని ఉపశమనం కలుగుతుందని వైద్యులు వివరిస్తున్నారు. ప్రతి వైద్య సెంటర్లలో ఓఆర్ఎస్ ద్రావణాన్ని అందుబాటులో ఉంచుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. నియోజకవర్గంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు పాలకొల్లు మండలంలో లంకలకోడేరు, పోడూరు మండలంలో పోడూరు, యలమంచిలి మండలంలో దొడ్డిపట్ల, మేడపాడు, యలమంచిలిలో ఉన్నాయి. అలాగే పట్టణంలో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రితో పాటు అర్బన్ హెల్త్ సెంటర్లు బంగారువారి చెరువుగట్టు, కొత్తపేటల్లో ఉన్నాయి.

ఓఆర్ఎస్ తాగే విధానం

ఓఆర్ఎస్ అనేది వివిధ లవణాల మిశ్రమంతో కూడని ద్రావణం. ఈ ద్రావణాన్ని 20.5 గ్రాముల ప్యాకెట్లు రూపంలో అన్ని ప్రాథమిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రుల్లో లభిస్తుంది. ఈ ప్యాకెట్‌లో 2.6 గ్రాముల సోడియం, 1.5 గ్రాముల పొటాషియం, 2.9 గ్రాములు సోడియం సిట్రేట్, 13.5 గ్రాములు డెక్స్‌ట్రోజ్ ఉంటాయి. ఈ పౌడర్ ప్యాకెట్‌లను లీటరు నీటిలో కలిపి రోజూ మొత్తంలో వయస్సును బట్టి తగిన మోతాదులో తీసుకోవాలి. సమయానికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో లేకపోతే ఇంటిలోనే ఈ ద్రావణాన్ని తయారు చేసుకోవచ్చు. లీటరు నీటిలో చిటికెడు ఉప్పు, అర స్పూను పంచదార కలిపి తాగవచ్చు. రెండేళ్ల లోపు వారు 100 ఎంఎల్ లోపు ద్రావణాన్ని అరస్పూన్ చొప్పున ప్రతి పది నిమిషాలకు ఒకసారి తాగాలి. రెండు నుంచి పదేళ్ల వయస్సు కలిగిన వారు 100–200 ఎం.ఎం ఒక గ్రాస్ వరకూ ఒక స్పూన్ చొప్పున తాగాలి. పదేళ్లు పైబడిన వారు 50 ఎం.ఎల్ చిన్న గ్లాస్ చొప్పున ఎండలో సంచరిస్తున్న స్థితిగతులను బట్టి తాగాలి.

అందుబాటులో ఓఆర్ఎస్ ప్యాకెట్లు



వేసవికాలం దృష్ట్యా ప్రజల ఆరోగ్య కోసం వడదెబ్బ నుంచి ఉపశమనం కలిగించేందుకు అన్ని సచివాలయాలు, వైద్యారోగ్య కేంద్రాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాం. ఓఆర్ఎస్ ద్రావణం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి ఇంటింటికి వెళ్లి మా సిబ్బంది వివరిస్తున్నారు. ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు. ఒక్కో ఆశ వద్ద 100 ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ టాబ్లెట్లు ఉంటున్నాయి.

– డాక్టర్ హెనా, అర్బన్ హెల్త్ సెంటర్, కొత్తపేట, పాలకొల్లు

క్లుప్తంగా

వైభవంగా ఎంబేరుమనార్ స్వామి ఉత్సవాలు


ఆలయం వద్ద పూజలు చేస్తున్న తమిళనాడు భక్తులు

నరసాపురం: స్థానిక శ్రీ ఆదికేశవ ఎంబేరుమానార్ దేవస్థానంలో శ్రీ భగవత్ రామనాజాచార్యులు తిరునక్షత్ర ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమిళనాడుకు చెందిన 250 మంది భక్తులు హాజరై పూజలు, ప్రవచనాల్లో పాల్గొన్నారు. రామానుజాచార్యుల నామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. పండితులు దేశంలో తమిళనాడులోని పెరంబదూర్ తరువాత నరసాపురంలో మాత్రమే ఉన్న సుమారు 500 సంవత్సరాల చరిత్ర ఉన్న ఎంబేరుమనార్ ఆలయ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ఆర్‌వీవీఎస్ రామచంద్రకుమార్, ప్రధానార్చకుడు పెద్దింటి మోహనరామాచార్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

శివాలయంలో దత్తాత్రేయ పూజ


శివాలయంలో అనఘాష్టమి పూజ నిర్వహిస్తున్న దృశ్యం

యలమంచిలి: పాలకొల్లు పట్టణానికి చెందిన శ్రీదత్త జ్ఞాన బోధ సభ ఆధ్వర్యంలో స్థానిక ఉమాసోమేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం అనఘాష్టమి (దత్తాత్రేయుడు, లక్ష్మీ దేవి) పూజ నిర్వహించారు. దత్తపీఠ అర్చకులు మోహనరావు బ్రహ్మత్వంలో గణపతి పూజ, సద్గురు పూజ నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై పూజలో పాల్గొన్నారు. పూజానంతరం భక్తులకు మహాదాశీర్వచనం, తీర్థ ప్రసాద వితరణ చేశారు. ఈ పూజా కార్యక్రమం దత్తపీఠ ట్రస్ట్ సభ్యులు ఆచంట కృష్ణాజీ, ఎస్‌వీ సుబ్బారావు, అనగర్ల రాణి, ఆచంట సాయిరామ్ రిటైర్డ్ ఏసీటీఓ యలమంచిలి సత్యనారాయణమూర్తి పర్యవేక్షణలో నిర్వహించారు.

భక్తాంజనేయునికి ప్రత్యేక పూజలు


మంచినీటి చెరువుగట్టున ఉన్న భక్తాంజనేయస్వామి

యలమంచిలి: వైశాఖ మాసం దేవతారాధనకు ప్రాశస్త్యమని వైకానస అర్చకులు వాడపల్లి మురళీ కృష్ణమాచార్యులు చెప్పారు. వైశాక శుద్ధ విదియ సందర్భంగా స్థానిక మంచినీటి చెరువు గట్టున ఉన్న శ్రీ భక్తాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన బ్రహ్మత్వంలో ఆంజనేయస్వామికి వట్టి వేరు, బంతి, చామంతి పువ్వులతో పుష్పాభిషేకం, తమలపాకులు, గంగ సింధూరంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి వచ్చి స్వామివారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా అర్చకులు మాట్లాడుతూ మే నెల 6 నుంచి 12 వరకు యలమంచిలి సెంటర్‌లో ఉన్న కేశవస్వామి ఆలయంలో శ్రీదేవి భూదేవి సమేత కేశవస్వామి వారి వార్షిక కల్యాణోత్సవాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

సాయిబాబాకు పంచామృతాభిషేకం


ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న సాయిబాబా

భీమవరం అర్బన్: మండలంలోని రాయలం గ్రామంలో కొలువైన శ్రీవిజయసాయిబాబా వారి 7వ వార్షికోత్సవంలో భాగంగా మంగళవారం సాయిబాబాకు పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, గోక్షీరాభిషేకాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బాబాకు వివిధ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. కూనపరెడ్డి వెంకట ప్రసాద్ దంపతులు కలశ పూజ, విఘ్నేశ, గౌరి, శని తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బాబావారిని గ్రామంలో పురవీధులగుండా త్రిప్పుతూ గ్రామోత్సవం నిర్వహించారు. బుధవారం అఖండ అన్నసమారాధన, సాయంత్రం కోలాటం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఆక్రమణల తొలగింపుపై విమర్శలు తగదు

పాలకోడేరు: పాలకోడేరు శివారు ఏఎస్ఆర్ నగర్‌లో ఆక్రమణల వల్ల పంట కాలువ కలుషితమై కుముదపల్లి గ్రామ ప్రజలకు సురక్షిత నీరు అందడం లేదని కుముదవల్లి సర్పంచ్ భూపతిరాజు వంశీకృష్ణంరాజు అన్నారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాలువల ప్రక్షాళనకు ప్రజాప్రతినిధులను వేడుకోగా కాలువ వెంబడి స్థలాలను ఆక్రమించుకుని ఇళ్లు నిర్మించుకుని వారు వాడే జలాలను కాలువలోకి వదలడం వలన తాగు, సాగునీరు కలుషితమవుతుందని గుర్తించి, ఆక్రమణలను తొలగిస్తుంటే సీపీఎం నాయకులు రాజకీయం చేస్తూ ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజుపై విమర్శలు చేయడం సరికాదన్నారు. రాజుల కాలువను ప్రక్షాళన చేయాలంటూ పార్టీలకతీతంగా గ్రామస్తులు ఎమ్మెల్యేకు మద్దతు పలుకుతూ నినాదాలు చేశారు. మంతెన సత్యనారాయణ రాజు, భూపతిరాజు శ్రీనివాసరాజు, నాగేంద్ర వర్మ, రమేష్ రాజు, రమణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల అందజేత

పాలకొల్లు సెంట్రల్: విద్యను అంత కచ్చితంగా ముందుకు తీసుకు వెళ్లాలనే భావన ఎప్పుడైతే కలిగిందో అప్పుడే విజయం సాధించినట్లని స్కూల్ చైర్మన్ డాక్టర్ సీహెచ్ సత్యనారాయణమూర్తి (బాబ్జి) అన్నారు. మాంటిస్సోరిస్ స్కూల్, సబిత ఉమెన్స్ జూనియర్ కళాశాలలో మెరిట్ విద్యార్థులకు రూ. 20 లక్షల స్కాలర్‌షిప్‌లు సోమవారం రాత్రి స్థానిక లయన్స్ కమ్యూనిటీ హాలులో జరిగిన కార్యక్రమంలో అందించారు. ఈ సందర్భంగా బాబ్జి మాట్లాడుతూ తమ స్కూల్, జూనియర్ కళాశాలలో ఉత్తమ విద్యా ఫలితాలు సాధించిన 250 మంది విద్యార్థులకు రూ. 20 లక్షల స్కాలర్‌షిప్‌లు అందివ్వడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో ఎంవీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందిస్తున్న డాక్టర్ బాబ్జి

మాంటిస్సోరిస్‌కు తెలుగు బుక్ ఆఫ్ రికార్డులు

ఉల్లంపర్రు మాంటిస్సోరిస్ పాఠశాల తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్ వసంతలక్ష్మి తెలిపారు. సోమవారం రాత్రి స్థానిక లయన్స్ కమ్యూనిటీ హాలులో జరిగిన కార్యక్రమంలో తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ బృందం పాల్గొని మాంటిస్సోరిస్ అధినేతలు మద్దాల రాంప్రసాద్, వాసులకు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ వ్యవస్థాపకులు చింతపట్ల వెంకటాచారి, ద్రోణాచార్య అవార్డు గ్రహీత డాక్టర్ టీవీ అశోక్‌కుమార్, డాక్టర్ హెచ్ సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

పాలకొల్లు సెంట్రల్: రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి సారించాలని ముఖ్యంగా కౌలు రైతులు దీనిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ప్రకృతి వ్యవసాయ వార్షిక ప్రణాళిక జిల్లా కో–ఆర్డినేటర్ అరుణ కుమారి అన్నారు. మంగళవారం పాలకొల్లు మండలంలోని చింతపర్రు, దిగమర్రు గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ వార్షిక ప్రణాళిక ప్రచార కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహనా సదస్సులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అరుణ కుమారి మాట్లాడుతూ ఎస్‌హెచ్‌జీ సంఘాల ద్వారా సర్వే విభజన, నవధాన్యాల వినియోగం, సేంద్రియ పదార్థాల తయారీ, సూక్ష్మజీవుల సంరక్షణ, పచ్చిరొట్ట ప్రయోజనాలు, వాతావరణ మార్పులపై అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయంలో రెండు గ్రామాల్లో అనుభవం కలిగిన ఐదేళ్ల సీనియర్ రైతులు కుక్కల చిన్న వరదయ్య, కె సహదేవుడు, జి గంగయ్య, ఇంజేటి కొండలరాయుడులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాప్ డివిజన్ ఇంచార్జ్ అప్పారావు, గ్రామ సర్పంచ్ గుమ్మాపు పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.


రైతులను సన్మానిస్తున్న జిల్లా కో–ఆర్డినేటర్ అరుణ కుమారి

ఫాస్టాక్ ఫుడ్‌సేఫ్టీ శిక్షణ సర్టిఫికెట్‌లు పంపిణీ

పాలకొల్లు సెంట్రల్: ప్రతి వ్యాపారస్తుడూ వ్యక్తిగత శుభ్రత పాటించాలి అలాగే కల్తీలను గుర్తించి నాణ్యమైన ఆహారాన్ని అందించాలని మునిసిపల్ కమిషనర్ బి.విజయసారధి అన్నారు. మంగళవారం స్థానిక మునిసిపల్ కార్యాలయంలో ఫాస్టాక్ ఫుడ్ సేఫ్టీ శిక్షణ సర్టిఫికెట్‌లను ఆహార వ్యాపారస్తులకు అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ విజయసారధి మాట్లాడుతూ ఫుడ్ లైసెన్స్‌తో పాటు ఫాస్టాక్ ట్రైనింగ్ సర్టిఫికెట్ తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. జాతీయ ఆహార భద్రతా సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందన్నారు. వీధి వ్యాపారులతో పాటు చిరు వ్యాపారులు, హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, బేకరీ, స్వీట్ షాప్స్, పానీపూరి, చికెన్, మటన్, కూల్‌డ్రింక్స్ ఇలా అన్ని ఫుడ్ వ్యాపారస్తులు అందరూ పాస్టాక్ సర్టిఫికెట్ పొందాలన్నారు. కార్యక్రమంలో వి.దానేశ్వరరావు, చంద్ర, శ్రావణి, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.



వీధి వ్యాపారస్తులకు ఫాస్టాక్ సర్టిఫికెట్లు అందిస్తున్న కమిషనర్ విజయసారధి

ప్రజల్లో న్యాయ వ్యవస్థపై అవగాహన పెంచాలి

నరసాపురం: ప్రజల్లో న్యాయవ్యవస్థపై అవగాహన పెంచాలని నరసాపురం పదో అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయసేవాధికారసంస్థ చైర్మన్ ఎ.వాసంతి సూచించారు. మంగళవారం కోర్టు హాల్‌లో ప్యానల్ న్యాయవాదులు, పారాలీగల్ వలంటీర్లు, నామినేటెడ్ మెంబర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి వాసంతి మాట్లాడుతూ న్యాయసేవాధికార సంస్థ చేపట్టే అవగాహనా కార్యక్రమాలను పూర్తిస్థాయిలో విజయవంతం చేయాలని చెప్పారు. ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చూడాలని సూచించారు. ప్రజలు చట్టాలపై అవగాహన పెంచుకునే విధంగా తమవంతు పాత్ర పోషించాలని చెప్పారు. ముఖ్యంగా జాతీయలోక్ అదాలత్‌లను విజయవంతం చేయడానికి కృషి చేయాలని వివరించారు. మే 10న జరిగే జాతీయలోక్ అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసులు రాజీ చేసుకునే విధంగా కృషి చేయాలని వివరించారు.


సమావేశంలో మాట్లాడుతున్న నరసాపురం పదో అదనపు జిల్లా జడ్జి ఎ.వాసంతి

ఉచిత న్యాయ సహాయాన్ని వినియోగించుకోవాలి

నరసాపురం: ఆర్థిక స్తోమత లేకుండా, న్యాయవాదిని నియమించుకునే వీలులేని రిమాండ్ ఖైదీలు ఉచిత న్యాయ సహాయకేంద్రం ద్వారా అందే సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయసేవాధికారసంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ సూచించారు. మంగళవారం ఆయన నరసాపురం సబ్‌జైలును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఖైదీల కేసులు, వివరాలను ఆరా తీశారు. ఖైదీలకు వాయిదాల సమాచారాన్ని సక్రమంగా చేరవేస్తున్నారా? లేదా? జైలులో వసతులు, ఆహారం ఏ విధంగా పెడుతున్నారు? మంచినీటి సౌకర్యం బాగుందా? వంటి అంశాలను ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. రిమాండ్ ఖైదీలకు నిబంధనలకు అనుగుణంగా సబ్‌జైలులో సదుపాయలు ఏర్పాటు చేయాలని జైలు అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయసేవాధికార సంస్థ పర్యవేక్షణలో సబ్ జైలులో ఉచిత న్యాయ సహాయ కేంద్రం నడుస్తుందని చెప్పారు. ఖైదీల ఆరోగ్యం విషయంలో కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఆయన వెంట సబ్‌జైలు సూపరింటెండెంట్ టి.అప్పారావు, ప్యానల్ న్యాయవాదులు శిరీష, చాముండేశ్వరి ఉన్నారు.


సబ్ జైలులో ఖైదీలతో మాట్లాడుతున్న రత్నప్రసాద్

పేదల ఆరోగ్యమే లక్ష్యంగా

ఆకివీడు: పేదల ఆరోగ్యమే లక్ష్యంగా లయన్స్ క్లబ్‌లు పని చేస్తున్నాయని లయన్స్ జిల్లా గవర్నర్ డాక్టర్ డి.సుబ్బారావు చెప్పారు. స్థానిక లయన్స్ ఆడిటోరియంలో మంగళవారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్య సేవలందించడంలో లయన్స్ అతి పెద్ద సేవా సంస్థగా నిలిచిందన్నారు. ఆకివీడులో లయన్స్ తరపున పలు శాశ్వత పథకాలు అమలు చేయడం అభినందనీయమన్నారు. లయన్స్ మాజీ గవర్నర్ డాక్టర్ ఎంవీ.సూర్యనారాయణరాజు మాట్లాడుతూ ఆకివీడు లయన్స్ క్లబ్‌లు విద్య, వైద్య సేవలందించడంలో ప్రథమంగా నిలిచాయన్నారు. కార్యక్రమంలో 324 మంది రోగులకు వైద్య సేవలందించారు. సుమారు రూ.80 వేల విలువైన మందులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు ఎంవీఎస్‌డీ సుబ్బారావు, మల్లేశ్వరరావు, శివరామకృష్ణంరాజు, ఎండీ. బిలాల్, నిలోఫర్, కవిత, కె.మహేష్ వర్మ, పి.రామకృష్ణంరాజు, కె.కిరణ్, మాధవి, ఎం.శ్రీనివాస్, జె.అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యతో పాటు సమాజ అధ్యయనం అవసరం

పాలకొల్లు సెంట్రల్: విద్యార్థులు విద్యతోపాటు వివిధ సంస్థలను, పరిశ్రమలను అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి అన్నారు. మంగళవారం స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రసాయన శాస్త్రం, కంప్యూటర్ సైన్స్ విభాగాల ఆధ్వర్యంలో ద్వితీయ సంవత్సరం విద్యార్థిని విద్యార్థులకు ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీలో భాగంగా ఇండస్ట్రియల్ టూర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాజరాజేశ్వరి మాట్లాడుతూ రసాయన శాస్త్రం, కంప్యూటర్ సైన్స్ విభాగాల ఆధ్వర్యంలో రెండో సంవత్సరం విద్యార్థినీ విద్యార్థులను ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీలో భాగంగా ఇండస్ట్రియల్ టూర్‌కు రాజమండ్రి లో సీటీఆర్ఐ అండ్ అమరావతి సొల్యూషన్‌కు పంపిస్తున్నామన్నారు. విద్య మానసిక వికాశాన్ని పెంపొందిస్తే సంస్థలు, పరిశ్రమల అధ్యయనం విద్యార్థుల జీవనోపాధిని మెరుగుపర్చడానికి ఉపయోగపడుతుందన్నారు. అన్ని వసతులు కలిగిన ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదివించడం వల్ల ఇటువంటి మానసిక ఎదుగుదలతో పాటు సృజనశీలత పెంపొందించుకుని తమ కాళ్లపై తాము ఎలా జీవించాలో? తెలుసుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ వి.యామిని, కె.భద్రాచలం, శివకృష్ణ, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.


ఇండస్ట్రియల్ టూర్‌కు వెళుతున్న విద్యార్థులు

జాబ్‌మేళాలో 80 మందికి ఉద్యోగాలు

తణుకు అర్బన్: తణుకు ఎస్‌సీఐఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి)లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఏపీఎస్ఎస్‌డీసీ, నేషనల్ కెరియర్ సర్వీస్ ఎన్‌సీఎస్ కళాశాల జవహార్ నాలెడ్జ్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో ఎన్ఆర్‌సి స్థాయిలో మంగళవారం ఉద్యోగమేళా నిర్వహించారు. ఈ మేళాలో 14 ప్రముఖ కంపెనీలు పాల్గొని ఉద్యోగ అవకాశాలు కల్పించాయని కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ ఏడుకొండలు తెలిపారు. మొత్తం 220 మంది విద్యార్థులు పాల్గొనగా వారిలో 80 మంది విద్యార్థులు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికైనట్లు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డీఎస్‌డీఓ డాక్టర్ పి.లోకమాన్, ఎంప్లాయిమెంట్ ఎం.కిషోర్ రెడ్డి, స్కిల్ డెవలప్మెంట్ సిబ్బంది, స్కిల్ హబ్ ఇన్‌చార్జ్ డాక్టర్ కే. నాగభూషణ్ రెడ్డి, జెకెసి కోఆర్డినేటర్ డాక్టర్ టి. సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

సబ్ జైలు సందర్శన

తణుకు అర్బన్: జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఉమ్మడి గోదావరి జిల్లాల సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి కె.రత్న ప్రసాద్ మంగళవారం తణుకు సబ్‌జైల్‌ను సందర్శించారు. రిమాండ్ ముద్దాయిలకు అందుతున్న ఆహారం, వసతి, వైద్య సదుపాయాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ న్యాయవాదిని పెట్టుకునే స్తోమత లేని ముద్దాయిలకు మండల న్యాయ సేవల కమిటీ ద్వారా ఉచిత న్యాయవాదిని వారి ఆర్థిక స్థోమతను పరిశీలించి ఏర్పాటు చేస్తామని చెప్పారు. అలాగే శిక్ష పడిన ముద్దాయిలు కూడా వారి కేసులు అప్పీల్ చేసుకునేందుకు ఆర్థిక స్థోమత లేనిపక్షంలో వారికి కూడా ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. జైలులో ఎవరైనా అనారోగ్యంతో ఇబ్బందులు పడితే వెంటనే వారికి వైద్య సదుపాయాలు అందజేయాలని జైల్ సూపరింటెండెంట్ మోహన్‌రావును ఆదేశించారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పాలకొల్లు సెంట్రల్: విద్యాహక్కు చట్టం ప్రకారం 2025–26 విద్యా సంవత్సరానికి ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు ఉచిత ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పోడూరు మండల విద్యాశాఖాధికారి జి.విజయకుమార్ మంగళవారం తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఒకటో తరగతిలో ప్రవేశాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. మే 2 నుంచి 19 వరకూ దరఖాస్తులు చేసుకోవచ్చని అన్నారు. అర్హులైన విద్యార్థులు ప్రాథమిక వివరాలతో సీఎస్ఈ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో మాత్రమే అవసరమైన పత్రాలతో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దరఖాస్తుదారులు ప్రస్తుత చిరునామా కోసం విద్యార్థుల తల్లిదండ్రులు ఆధార్, ఓటర్, రేషన్, భూమి హక్కుల పత్రం, ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డు, ఫొటోలు, డ్రైవింగ్ లైసెన్స్, విద్యుత్ బిల్లులు, అద్దె ఒప్పంద పత్రాల్లో ఏదో ఒక గుర్తింపు కార్డు, పిల్లల వయస్సు ధ్రువీకరణ పత్రంతో సమర్పించాలన్నారు. విద్యాశాఖాధికారి–2 జీవీ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కిశోర వికాసంపై అవగాహన


మేడపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

యలమంచిలి: కిశోర బాలికల ఉన్నతి కోసం మే 2 నుంచి జూన్ 10వ తేదీ వరకు గ్రామాలలో కిశోర వికాసం పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ సీడీపీఓ చెల్లుబోయిన ఇందిర తెలిపారు. ఈ కార్యక్రమ నిర్వహణకు ఐదుగురు సభ్యుల కమిటీ పని చేస్తుందన్నారు. కమిటీలో మహిళ పోలీస్, అంగన్‌వాడీ టీచర్, ఏఎన్ఎం, ఆశ కార్యకర్త, డ్వాక్రా గ్రామ సంఘ అధ్యక్షురాలు సభ్యులుగా ఉంటారన్నారు. వీళ్లంతా ఈ 40 రోజులు ఏ కార్యక్రమాలు నిర్వహించాలో మంగళవారం మేడపాడు అంగన్‌వాడీ కేంద్రంలో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహ్మద్ హసీనా, మహిళా పోలీసులు, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, డ్వాక్రా గ్రామ సంఘ అధ్యక్షురాళ్లు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం


అంబేద్కర్ సెంటర్‌లో చలివేంద్రం ప్రారంభిస్తున్న ఇన్‌చార్జ్ తహసీల్దార్ సత్యనారాయణ

నరసాపురం: పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది కొత్తపల్లి రమేష్‌నాయుడుకు చెందిన కొత్తపల్లి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం అంబేద్కర్ సెంటర్‌లో వేసవి చలివేంద్రాన్ని ప్రారంభించారు. నరసాపురం ఇన్‌చార్జ్ తహసీల్దార్ అయితం సత్యనారాయణ చలివేందాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడం కోసం స్వచ్ఛంద సంస్థలు ఇలాంటి చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ట్రస్ట్ చైర్మన్ కొత్తపల్లి రమేష్‌నాయుడు మాట్లాడుతూ తమ ట్రస్ట్ ఏర్పాటు చేసి 4 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ ఏడాది మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో నరసాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చేగొండి బాలాజీ, మామిడిశెట్టి శ్రీనివాస్, తెన్నేటి సురేష్, జొన్నల శ్రీనివాస్, కోటిపల్లి దొరయ్య, కొప్పినీడి రాధాకృష్ణ, రంపాపుల్లాజీ, కుర్రెళ్ల సోమశేఖర్, సత్తినేటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఈదురు గాలులతో తుంపర్ల వర్షం

ఆకివీడు: మండలంలోని పలు గ్రామాల్లో ఆకస్మికంగా మంగళవారం రాత్రి ఈదురుగాలులు, తుంపర్ల వర్షం కురిసింది. సాయంత్రం ఒక్కసారిగా వాతావరణంలో మార్పు రావడంతో రైతులు బెంబేలెత్తిపోయారు. పలు చోట్ల కల్లాల్లో ధాన్యం ఉంది. చేతికి అంది వచ్చిన పంట చేలల్లోనే ఉంది. కోతలకు సిద్ధమవుతున్న తరుణంలో ఈదురు గాలులు, తుంపర్ల వర్షంతో రైతు గుండెల్లో రైళ్లు పరుగెత్తాయి. హుటాహుటిన రైతులు ధాన్యం రాశులను టార్పాలిన్‌తో కప్పించారు. బస్తాల్లో ఉన్న ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకునే ప్రయత్నం చేశారు. భారీ వర్షం కురవకపోవడంతో రైతులు గట్టెక్కినట్లు అయ్యింది.